నవతెలంగాణ
1
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | ఏప్రిల్ 5, 2024 | www.navatelangana.com

సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసం



నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ సింగిల్ విండో సొసైటీ చైర్మన్ కిష్టాగౌడ్ పై సొసైటీ డైరెక్టర్లు గత నెలలో అవిశ్వాస తీర్మానాన్ని డిసిఓకు అందజేశారు. డి సి ఓ ఆదేశాల మేరకు గురువారం అవిశ్వాస తీర్మానానికి ఓటింగ్ నిర్వహించాలని నిర్ణయించడంతో సొసైటీ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అప్పటికే సొసైటీ చైర్మన్ కిష్టా గౌడ్ అవిశ్వాసానికి సంబంధించిన ప్రక్రియ సమావేశాన్ని నిర్వహించాలని, కానీ అవిశ్వాసానికి సంబంధించి ఎలాంటి ప్రకటన చేయవద్దని హైకోర్టు నుండి స్టే తీసుకురావడంతో సమావేశమైన డి సి ఓ అధికారులు డైరెక్టర్ల తో సమావేశం నిర్వహించి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు సొసైటీ చైర్మన్ పై పెట్టిన అవిశ్వాసానికి సంబంధించిన విషయాలను కోర్టు సూచనల మేరకు వెల్లడిస్తామని డి సి ఓ శ్రీనివాసరావు తెలిపారు. కాగా మొత్తం 13 మంది డైరెక్టర్లకు గాను సమావేశానికి 10 మంది డైరెక్టర్లు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై రామచంద్రనాయక్ కార్యాలయ ఆవరణలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్పాట్ వ్యాల్యుయేషన్‌కు హాజరుకాకుంటే సస్పెన్షన్ వేటు : డీఈవో

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎస్ఎస్‌సీ స్పాట్ వాల్యుయేషన్ క్యాంప్‌నకు గురువారం వరకు 58 మంది ఇంకా హాజరుకాలేదని డీఈదో దుర్గా ప్రసాద్ తెలిపారు. కమీషనర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ సూచనల మేరకు స్పాట్ పర్సనల్ డ్రాఫ్ట్ చేసిన వారందరూ ఎటువంటి మినహాయింపులు లేకుండా శుక్రవారం (ఈనెల 5న) ఉదయం 8 గంటల లోపు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని, లేకుంటే 1997 యాక్ట్ 25 ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఎటువంటి నోటీసు లేకుండా సస్పెన్షన్‌లో ఉంచనున్నట్టు తెలిపారు. కావున నేటి ఉదయం రిపోర్ట్ చేయాలని సూచించారు.

ఇంజక్షన్ వికటించి బాలుడు మృతి

- గడువు పూర్తయిన ఇంజక్షన్ ఇచ్చిన ప్రయివేటు ఆస్పత్రి
- కలెక్టరేట్‌లో, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బాధితులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కాలం చెల్లిన ఇంజెక్షన్ ఇవ్వడంతో ఓ బాలుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా గురువారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. ధర్పల్లి మండలానికి చెందిన 10 నెలల బాలుడు గత నెలలో అస్వస్థతకు గురవ్వడంతో నగరంలోని ఖలీల్‌వాడీలోని కీర్తికేర్ చిల్డ్రన్ హాస్పిటల్‌కు తరలించారు. ఐదు రోజులు వైద్యం తర్వాత బాలుడి ఆరోగ్యం మెరుగైంది. తీరా డిశ్చార్జి చేసే సమయంలో ఓ ఇంజక్షన్ ఇచ్చారు. ఆ తర్వాత బాలుడు ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. మెరుగైన చికిత్స కోసం మరో ఆస్పత్రికి తరలించాలని సదరు ఆస్పత్రి వైద్యుడు సూచించాడు. హైదరాబాద్‌కు తరలించే సమయంలో బాలుడు మృతి చెందాడు.

కుటుంబీకులకు అనుమానం వచ్చి ఇంజక్షన్ గురించి ఆరా తీయగా ఈ ఏడాది ఫిబ్రవరిలోనే గడువు ముగిసినట్లు గుర్తించారు. అనంతరం ఈ విషయమై కలెక్టర్‌తో పాటు ఒకటో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు ఈ విషయాన్ని గుర్తించిన ఆస్పత్రి యాజమాన్యం తమకు తప్పుడు బిల్లులు ఇచ్చిందని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. ఈ విషయంలో కాలం చెల్లిన ఇంజక్షన్లు, మందులు ఇవ్వడం వల్ల ఇంకా ఎంతమంది ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని సాధారణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు స్పందించి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ధాన్యం డబ్బులు సకాలంలో జమచేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రైతులను సకాలంలో వడ్ల డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలి అని అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులు వారి బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేలా టాబ్ అపరేటర్స్, రైతుల వివరాలు, వెంటవెంటనే ఆన్లైన్ లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఐకేపి కొనుగోలు కేంద్రాల నిర్వహకులతో సమావేశంలో పాల్గొని, అధికారులు, టాబ్ ఆపరేటర్లు, బాధ్యతయుతంగా రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని పని చేయలని కోరారు. ఈ కార్యక్రమం డిఆర్డిఓ సాయ గౌడ్, డిసివో చంద్ర ప్రకాష్, డిఎం సివిల్ సప్లయ్ జగదీశ్వర్, డివియం సాయిలు, ఏపియం గంగాదర్, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు

పేరుకుపోతున్న మురుగు

ఎక్కడిచెత్త అక్కడే..

- విజృంభిస్తున్న దోమలు
- దుర్గంధం, దోమల బెడదతో అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని గ్రామ పంచాయతీ అధికారులు



బిచ్కుంద : బురద మాయంగా మారిన మురికి కాలువ



బిచ్కుంద: మురికి కాలువలో చెత్తాచెదారం

నవతెలంగాణ-బిచ్కుంద/భిక్కనూర్

గ్రామపంచాయతీ ద్వారా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు నీటి వసతి, మురికి కాలువల నిర్మాణం, పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా మురికి కాలువలలో పేరుకు పోయిన మురికి తొలగించడం, వీధులు శుభ్రంగా ఉంచడం తదితర శుభ్రత కార్యక్రమాలు గ్రామపంచాయతీ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించాల్సి ఉంటుంది. బిచ్కుంద గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వార్డులలోని ప్రజలు వ్యాధుల బారిన పడి అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులు ప్రధాన వీధులను శుభ్రం చేయిస్తూ వార్డులలోని వీధులలో శుభ్రత కార్యక్రమాలు చేపట్టడం పూర్తిగా మరిచిపోయారు. వీధులలో మురికి కాల్వలోని చెత్తాచెదారం తొలగించక పోవడంతో దుర్గంధం వ్యాప్తి చెంది మురికి నీళ్లలో దోమలు, ఈగలు తయారై దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ, ఫైలేరియా, మలేరియా, టైఫాయిడ్, మెదడు వాపు తదితర వ్యాధుల బారిన పడి అనారోగ్యానికి గురవుతున్నారు.

మురికి కాలువలలోని చెత్తాచెదారం తొలగించి నెలలు గడుస్తున్న కుప్పలు ఎత్తివేయకపోవడంతో దుర్గంధం వ్యాపించి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మురికి కాల్వలోని మురికి తొలగించాలని దుర్గంధం వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లాలని గ్రామపంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన సిబ్బంది కొరత సాకు చూపెట్టడమే తప్ప వీధులలో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడంలో విఫలమవుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు తన స్వలాభం కోసం చేసే పనులు మీద చూపించినంత శ్రద్ధ ప్రజల సమస్యల పై చూపెట్టడం లేదంటూ గ్రామ ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

పత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్న గ్రామపంచాయతీల నిర్వహణ వార్డులలో శుభ్రత కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మేలు చేకూర్చే పనులను చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రత్యేక అధికారులు గ్రామపంచాయతీ అధికారులు కృషి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



దోమల స్వైర విహారం

భిక్కనూర్ : భిక్కనూరు పట్టణంలోని డ్రైనేజీ కాలువలలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. కొన్ని రోజుల నుండి మురికి కాలువలు శుభ్రంగా లేని కారణంగా పలు కాలనీలలో మురికి నీరు నిలిచిపోవడంతో విచ్చలివిడిగా దోమల సంత పెరిగిపోతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి గ్రామ సర్పంచుల పదవి కాల సమయంలో ఎప్పుడు కూడా డ్రైనేజీలలో దోమల మందు కొట్టిన దాఖలాలు లేవు. ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్ల పాలనలోలైన పంచాయతీ అధికారులు స్పందించి మురికి కాలులలో దోమల మందు కొట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పట్టణంలో ఇటీవల కాలంలో ఎన్ హెచ్ 7 రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన డ్రైనేజీలలో మురికి నీరు పేరుకుపోయి దుర్వాసన వస్తుందని దీనికి తోడు దోమల సంత పెరిగిపోయి మలేరియా, డెంగ్యూ, విష జ్వరాలు వ్యాపించే అవకాశం ఉంది. గ్రామపంచాయతీ అధికారులకు దోమల బెడద భరించలేక దోమల మందు కొట్టాలని, డ్రైనేజీలలో దోమల సంత పెరగకుండా ఆయిల్ బాల్స్ వేయాలని అధికారులకు తెలియజేసిన ఇప్పటివరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

పట్టణంలోని కొన్ని కాలనీలలో దోమల బెడద కారణంగా విష జ్వరాలు వ్యాపిస్తున్నాయని ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీలలో దోమల మందు పిచికారి చేసి దోమల బెడద లేకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుచున్నారు.

మరుగుదొడ్డి నిర్మాణం @ 25 లక్షలు

- ఇంటి నిర్మాణం కంటే ఎక్కువ ఖర్చు
- మరుగుదొడ్ల నిర్మాణంలో అవినీతి..?
- నిర్మాణంలో పంచాయతీ అధికారుల వాటా ఎంత..?
- ప్రజాధనం దుర్వినియోగంపై ఆరా తీసేనా..?



నవతెలంగాణ-భిక్కనూర్

ప్రస్తుత కాలంలో ఒక 100 గజాల ఇంటిని నిర్మించాలంటే సుమారు 15 లక్షల నుండి 20 లక్షల వరకు ఖర్చు అవుతుంది. 60 లేదా 70 గజాల స్థలంలో మరుగుదొడ్డు నిర్మించాలంటే 10 లక్షల నుండి 15 లక్షల కంటే ఎక్కువ ఖర్చు కాదు. కానీ మరుగుదొడ్ల నిర్మాణానికి ఏకంగా రూ.25 లక్షలు వెచ్చించడం గమనార్హం. ఈ విషయం తెలిసిన స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. పంచాయతీరాజ్ అధికారులు అసలు ఏ విధంగా 25 లక్షల ఎస్టిమేషన్ వేశారు? ఏ విధంగా 25 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఎంబి రికార్డు చేసి ఏ విధంగా బిల్లు పాస్ చేశారు. ప్రజాధనం దుర్వినియోగం అవుతున్న జిల్లా అధికారులు మౌనంగా ఎందుకు ఉన్నారు. ఎవరెవరికి ఎంత వాటా వెళ్ళింది..?, ఎందుకు భారీ మొత్తంలో అవినీతికి పాల్పడ్డారు తెలియాల్సి ఉంది.

భిక్కనూరు పట్టణంలో మరుగుదొడ్ల నిర్మాణం 25 లక్షల రూపాయలతో గ్రామపంచాయతీ నిధుల ద్వారా నిర్మించారు. కేవలం 60 గజాల స్థలంలో 25 లక్షలు భారీ మొత్తంలో ఖర్చు చేసి మరుగుదొడ్లు నిర్మించారంటే ఎంత మొత్తంలో స్కామ్ జరిగిందో అర్థమవుతుంది. అసలు పంచాయతీరాజ్ ఏ ఈ అధికారులు 25 లక్షలు ఖర్చు అవుతుందని ఏ విధంగా అంచనా వేశారు. భారీ మొత్తంలో ఖర్చు చేసి నిర్మించిన తర్వాత దానిని ఉపయోగంలోకి తీసుకు వచ్చారా అంటే 2 సంవత్సరాల నుండి నిర్మించి వదిలేసారే తప్ప ఉపయోగంలోకి తీసుకువచ్చిన పాపాన పోలేదు. నేటికీ నిర్మించిన మరుగుదొడ్లకు తాళం వేసి దర్శనమిస్తుంది. ప్రతి ఆదివారం జరిగే వారాంతపు సంతలో మార్కెటుకు వచ్చే వ్యాపారులు, ప్రజలు తాళం ఉన్న మరుగుదొడ్లను చూసి ఎక్కడ బహిర్భూమికి వెళ్ళాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

ఇటీవల మాజీ విప్ గంపగోవర్ధన్ కామారెడ్డి పట్టణానికి సమీపంలో ఉన్న రైల్వేగేట్ పాత రాజంపేట్‌లో ఒక నిరుపేద కుటుంబానికి 70 గజాల స్థలంలో తన సొంత డబ్బులు పది లక్షల రూపాయలతో కిచెన్, బెడ్ రూమ్, హాలు, టాయిలెట్స్ రూమ్స్ నిర్మించి ఇచ్చారు. ఒక సామాన్యుడికి ఒక మాజీ ఎమ్మెల్యే ఇంటిని నిర్మిస్తేనే 10 లక్షల రూపాయలు దాటలేదు కానీ భిక్కనూరు పట్టణంలో 60 గజాల స్థలంలో మరుగుదొడ్లు నిర్మిస్తే 25 లక్షలు ఏ విధంగా ఖర్చు అయిందో..?, భారీ మొత్తంలో అవినీతికి ఎందుకు జరిగిందో పంచాయితీ అధికారులు, జిల్లా అధికారులు వెలికి తీయాల్సి ఉంది. గ్రామపంచాయతీ పరిధిలో పాలకవర్గం ఏదైనా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటే ముందుగ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి మెజార్టీ సభ్యుల తీర్మానం మేరకు, గ్రామ సభలో చర్చించిన తర్వాత అభివృద్ధి పనులు చేపడతారు. అనంతరం పంచాయతీరాజ్ ఏఈకి తీర్మాన పత్రాన్ని అందజేసి పనులు చేపట్టడానికి ఎంత ఖర్చవుతుందో ఎస్టిమేషన్ కాపీ పంచాయతీకి అందజేస్తారు. 20 లక్షల లోపు నిర్మాణ పనులు చేపడితే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తారు. 20 లక్షల కంటే ఎక్కువ మొత్తంలో పనులు ఉంటే పేపర్ ప్రకటన ద్వారా టెండర్లు పిలిచి ఎవరు తక్కువ ఖర్చుతో నిర్మాణాలు చేపడతామని కొటేషన్ ఇస్తే వాళ్లకు పనులు అప్పగించాల్సి ఉంటుంది. ఏ విధంగా పనులు జరుగుతే ఆ విధంగా పంచాయతీరాజ్ ఏఈ కొలతలు వేసి ఎంబి రికార్డును పంచాయతీ కార్యదర్శి కి అందజేస్తే పంచాయతీరాజ్ ఏఈ ఇచ్చిన ఎం బి రికార్డు ప్రకారం పనులు చేసిన కాంట్రాక్టర్కు డబ్బులు చెల్లించాలి. ఇవేమీ జరగకుండా కేవలం మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.25 లక్షలు లెక్కలు చూపడం గమనార్హం.

ఏది ఏమైనప్పటికీ పట్టణంలో నిర్మించిన మరుగుదొడ్ల నిర్మాణంలోనే భారీ మొత్తంలో అవినీతి జరిగింది అంటే వరకు జరిగిన అభివృద్ధి పనులలో ఎంతవరకు జరిగిందో అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్ ఏఈ అధికారులు ఎందుకు భారీ మొత్తంలో నిధులు ఖర్చవుతాయని ఎస్టిమేషన్ కాపీ అందజేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. అవినీతి నిర్మాణాలు జరుగుతున్న మండల జిల్లా అధికా రులు ఎందుకు పర్యవేక్షించడం లేదు. ప్రజాధనం దుర్విని యోగం అవుతున్న అధికారులు చూసి చూడనట్టు వ్యవరించ డంపై పలు అనుమానాలకు తావిస్తుందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవినీతి కి పాల్పడి నిర్మించిన నిర్మాణాలపై ఆరా తీసి కాంట్రాక్టర్లపై, పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుచున్నారు.

వడదెబ్బతో బాలుడి మృతి



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని డోంకల్ తండా లో ఆర్ రాకేష్ (5) బాలుడు వడదెబ్బతో మృతి చెందినట్లు తాండవాసులు తెలిపారు. వారు తెలిపిన విరాలు ఇలా ఉన్నాయి.డోంకల్ తండా కు చెందిన అర్ రమేష ,అనిత లకు ముగ్గురు కూతుర్లు ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకుదెరువు కోసం తండ్రి గల్ఫ్ కు వెళ్లడంతో తల్లి పిల్లల బాగోగులు చేసుకుంటూ ఉంటున్నారు. గత రెండు రోజుల క్రితం రమేష్ కు వడదెబ్బ తగిలి జ్వరము వచ్చింది. ఈ క్రమంలో గురువారం పరిస్థితి విషమించి మృతిచెందాడు. రాకేష్ తాండలో ఉన్న అంగన్వాడి కేంద్రంలో చదువుకుంటుండేని వారన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం మాదుకోవాలని తాండవాసులు కోరుతున్నారు.

శ్రీచైతన్య టెక్నోస్కూల్‌కు 'తాళం'

- అద్దె చెల్లించకపోవడంతో తాళం వేసిన భవన యజమాని

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నగరంలోని గూపన్ పల్లి ప్రాంతంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలకు తాళం పడింది. భవనం అద్దె చెల్లించలేదని సదరు యజమాని స్కూల్ ప్రధాన గేటుకు గురువారం తాళం వేశాడు. దీంతో ప్రతిరోజు యధావిధిగా ఉదయం తమ పిల్లలతో కలిసి స్కూల్ దగ్గర దింపడానికి వచ్చిన తల్లిదండ్రులకు తాళం వేసి ఉండడంతో షాక్ కు గురయ్యారు. ఎందుకు తాళం వేశారని స్కూల్ మేనేజ్మెంట్ తల్లిదండ్రులు అడగడంతో ఈరోజు పాఠశాల కు సెలవు ప్రకటించినట్లు తప్పుడు సమాచారం ఇచ్చారని తల్లిదండ్రులు ఆరోపించారు. విద్యా సంవత్సరం ముగుసే సమయంలో పరీక్షలు ఉన్నా స్కూల్ మేనేజ్‌మెంట్ నిర్లక్ష్యం మూలంగా తమ పిల్లల భవిష్యత్తు ఇబ్బందులు నెలకొంటాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల వద్ద నుండి ఫీజులు వసూలు చేయడంలో చూపెట్టిన శ్రద్ధ అద్దె చెల్లించడంలో చూపెట్టలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అద్దె చెల్లించకుండా తాళం వేసే పరిస్థితి తీసుకొచ్చి విద్యార్థులను ఇక్కట్లకు గురిచేయడం సరికాదని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటివరకు తమకు స్కూల్ యాజమాన్యం 40-50 లక్షల వరకు డబ్బులు పెండింగ్‌లో పెట్టినట్టు భవన యాజమాని తెలపడం గమనార్హం. ఇలాంటి సమస్యలు తీసుకొస్తున్న స్కూల్ యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు కఠినంగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

- సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఏ.శరత్
- ఇరు జిల్లాల్లో అధికారులతో సమీక్ష



నవతెలంగాణ-కామారెడ్డి/నిజామాబాద్‌సిటీ

తాగునీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఏ. శరత్ అధికారులను ఆదేశించారు. గురువారం నిజామాబాద్, కామారెడ్డిలో ని కలెక్టరేట్‌లలో తాగునీటి ఎద్దడి నివారణపై జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు ఇరు జిల్లాల కలెక్టర్‌లు వేర్వేరుగా శరత్‌కు పూలమొక్కను అందించి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని తెలిపారు. మండల స్థాయిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ఫిర్యాదుల విభాగం ఏర్పాటుచేసి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కారం చేయాలని సూచించారు. ప్రతి మండలానికి జిల్లా స్థాయి అధికారులను స్పెషల్ అధికారులుగా నియమించాలన్నారు. మండల స్థాయి అధికారులను క్లస్టర్ అధికారులు గా నియమించి, వారం రోజులకోసారి తాగునీ టి ఎద్దడి పై సమీక్ష నిర్వహించాలని పేర్కొ న్నారు. కామారెడ్డి జిల్లాలో 842 ఆవాస ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం సదాశివనగర్ మండలం మరికల్ గ్రామ శివారులోని మల్లన్న గుట్ట సమీపంలో ఉన్న మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. తాగునీటికి ఇబ్బందులు రాకుండా తగు చర్యలను చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ సుజాత, మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ : జిల్లాలోని 33 మండలాల పరిధిలో గల 792 నివాస ప్రాంతాలకు ప్రధానంగా శ్రీరాంసాగర్, సింగూరు నుండి తాగునీటి లభ్యత ఉండగా, పై రెండు జలాశయాల్లోనూ సరిపడా నీటి నిలువలు అందుబాటులో ఉన్నందున తాగునీటి విషయమై ప్రజలు అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రధానంగా మంచి నీటి సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు హితవు పలికారు. మండల ప్రత్యేక అధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపీఓలతో కూడిన బం దాలను క్లస్టర్ అధికారులుగా నియమిస్తూ క్షేత్ర స్థాయిలో నీటి సరఫరా తీరును అనునిత్యం పర్యవేక్షణ జరపాలని సూ చించారు. ప్రస్తుత వేసవి సీజన్ దష్ట్యా మిషన్ భగీరథ, ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులకు కూడా సెలవులు రద్దు చేస్తున్నామని, ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున ఇప్పటికే ఎంపిడిఓలు, తహసీల్దార్లకు సెలవులు రద్దు చేయబడ్డాయని కలెక్టర్ గుర్తు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి,

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మోడల్ స్కూల్‌లో 6,7,8,9,10 తరగతిలో ప్రవేశానికి ఈనెల 7న ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 7న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు. 7,8,9,10వ తరగతుల్లో మిగులు సీట్లలో ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హాల్ టికెట్లను వశ్రీఖఅస్త్రుఖఖఎం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష వ్రాసే విద్యార్థుల తల్లిదండ్రులకు "ముఖ్యగమనిక" పరీక్ష సమయానికి 'ఒక గంట' ముందుమాత్రమే పరీక్ష కేంద్రానికి అనుమతించడం జరుగుతుందని తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-కంఠేశ్వర్

కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాలుగవ పోలీస్ స్టేషన్ పరిధిలోని రోటరీనగర్‌లో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సంజీవ్ వివరాల ప్రకారం.. నిజాంసాగర్‌కు చెందిన రాథోడ్ రమేష్ 10 సంవత్సరాల క్రితం నిజామాబాదు రోటరీ నగర్ కి చెందిన భార్గవి అనే అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు సంతానం ఉన్నారు. ఈ మధ్య కాలంలో రమేష్ భార్య భార్గవి, ఆమె అన్న బాల కృష్ణ , ఆమె తల్లిదండ్రులు కలిసి రమేష్ మానసికంగా బాధ పడేలా అతనితో నువ్వు బ్రతకడం ఎందుకు, అప్పులు ఎందుకు చేస్తున్నావ్, నువ్వు చచ్చిపో అని చెప్పి మొన్న బాలకృష్ణ ఇంటిలో జరిగిన ఫంక్షన్ లో రమేష్ ని బాలకృష్ణ కొట్టాడు. ఆ ఆ సభ్యులు మాట్లాడిన మాటలను, మానసిక బాధను భరించలేక గురువారం తెల్లవారుజామున ఉరేసుకొని హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి అన్న రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

ఆలేరు నియోజకవర్గ ఎలక్షన్ కోఆర్డినేటర్‌గా వేణుగోపాల్



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఆలేరు నియోజకవర్గ ఎలక్షన్ కోఆర్డినేటర్‌గా (సమన్వయకర్త) నియమిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఆలేరు నియోజకవర్గ ఎలక్షన్ కోఆర్డినేటర్‌గా తనకు అవకాశం కల్పించినందుకు

టిపిసిసి అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపి సిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు నరేందర్‌రెడ్డిలకు హద యపూర్వకంగా ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, భువనగిరి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్య ర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి గెలుపు కోసం నా వంతు కషి చేస్తానని బాస వేణుగోపాల్ యాదవ్ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామ పంచాయతీ అద్వర్యంలో గ్రామ పంచాయతీ ముందర దర్పల్లి, ఇందల్‌వాయి రహదారికి ఆనుకుని చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరునగరి శ్రీదర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతదికారుల ఆదేశానుసారం గ్రామ పంచాయతీ అద్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశామని, చలివేంద్రంలో అనునిత్యం ఫిల్టర్ నీళ్ల ఉంచడం జరుగుతుందని, చలివేంద్రం వద్ద నీరు అందించాడనికి ఒకరిని నియమించామని శ్రీధర్ వివరించారు. వచ్చే పోయే వారికి దాహార్తిని తీర్చడానికి రంజన్‌లను పేట్టి చల్లని త్రాగునీరు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కరోబార్ పిల్లి నరేందర్, సాయిలు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు

- ఆరవ రోజు శ్రీవారికి చక్రస్నానం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో గల ఇందూరు తిరుమల దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు యాగశాలలో మహా పూర్ణాహుతి అనంతరం భక్తులను ఉద్దేశించి దేవనాథ జియర్ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజదాస్ స్వామి ప్రవచనాలు చెప్పారు. ఆరవ రోజు స్వామి వారికి చక్రస్నాన కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. అలాగే సాయంత్రం వేలాది పువ్వులతో శ్రీపుష్ప యాగం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి దంపతులు, శిరీష్‌రెడ్డి దంపతులు, నర్సింహారెడ్డి దంపతులు, విజయసింహారెడ్డి దంపతులు, హరీష్ దంపతులు, సుదర్శన్‌రెడ్డి దంపతులు, నర్సారెడ్డి, నరాల సుధాకర్, నరేందర్, యాజ్ఞాచార్యులు సత్యన్నారాయణ ఆచార్యులు, రోహిత్ కుమారాచార్యా విజయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీబీపాటిల్ ఎంపీగా చేసింది శూన్యం

- అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..? కాంగ్రెస్ సవాల్



మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీధర్‌గౌడ్


నవతెలంగాణ-నాగిరెడ్డిపెట్

జహీరాబాద్ ఎంపీగా బీబీ పాటిల్ పది సంవత్సరాలుగా ప్రజలకు చేసింది శూన్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఒక్కసారి కూడా గ్రామాలకు వచ్చి తాగునీటి సమస్య గాని ప్రజలకు ప్రజలకు అత్యవసరం ఉన్న అంబులెన్స్ సదుపాయం గాని కల్పించడంలో విఫలమయ్యారని ఆయన అన్నారు. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీలో ఉండి ఏమి చేయలేని బి బి పాటిల్ ఆ పార్టీ పని అయిపోయిందని బిజెపి పార్టీలోకి మారారని ఎద్దేవ చేశారు. బిజెపి పార్టీలోకి మారినంత మాత్రాన ప్రజలు ఎవరూ ఆదరించారని అన్నారు. గత పది సంవత్సరాలలో నాగిరెడ్డిపేట్ మండలానికి వచ్చి ఎవరి కూడా ఎలాంటి సహాయం చేసింది లేదని అన్నారు. తెలుగు రాని బిపి పాటిల్ తమకు వద్దని అన్నారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా బీబీ పాటిల్ చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

పార్టీ మారినంత మాత్రాన ప్రజలు ఓటు వేయరని ఆయన అన్నారు జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ శెట్కార్ 50,000 వేల మెజారిటీతో గెలుస్తున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ఏ ఒక్కరోజు కూడా ప్రజల గురించి ఆలోచించినా పాపాన పోలేవని అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్ దివిటీ కిష్టయ్య, బోయిని విట్టల్, సుధాకర్, నరసింహారెడ్డి, పర్వత రావు, శేఖర్, గణేష్, మన్నె వెంకటి, మసూద్, షకీల్, ప్రభాకర్, జీవరత్నం తదితరులున్నారు.

వైస్ ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాస తీర్మానం



నవతెలంగాణ-నాగిరెడ్డిపెట్

నాగిరెడ్డిపేట్ మండల ప్రజా పరిషత్ వైస్ ఎంపీపీ దివిటి రాజ్‌దాస్‌పై నిర్వహించిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తూ ఆరుగురు ఎంపీటీసీలు చేతులెత్తారు.

గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎల్లారెడ్డి ఆర్‌డివో ప్రభాకర్ ఆధ్వర్యంలో అవిశ్వాస పరీక్ష నిర్వహించారు. గత సంవత్సరం 2023 జూలై ఏడో తేదీన నాగిరెడ్డిపెట్ మండలంలోని బీఆర్ఎస్‌కు చెందిన ఎనిమిది మంది ఎంపీటీసీలు వైస్ ఎంపీపీ రాజదాస్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అప్పట్లో వైస్ ఎంపీపీ రాజదాసు తనపై ఎంపిటిసిలు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు స్టే విధించడంతో బలపరీక్ష ప్రక్రియ నిలిచిపోయింది. ఇటీవలే హైకోర్టు స్టే ఎత్తివేయడంతో నాగిరెడ్డిపేట్ వైస్ ఎంపీపీ రాజ్ దాస్ పై అవిశ్వాస బల పరీక్ష గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీలు అవిశ్వాస పరీక్షకు అనుకూలంగా చేతులెత్తారు. అవిశ్వాస పరీక్ష నెగ్గినట్టుగా ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవిశ్వాస పరీక్షకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ తెలిపారు. అవిశ్వాస బలపరీక్షలో ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ తో పాటు నాగిరెడ్డిపేట్ తాసిల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో పర్వన్న ఉన్నారు.

లక్ష్మీ కెనాల్ నీటి విడుదలను కొనసాగించాలి

- ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

లక్ష్మీ కెనాల్ నీటి విడుదలను కొనసాగించాలని శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ ఎస్ఈ, సీఈలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యే గురువారం ఫోన్ ద్వారా ప్రాజెక్టు అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన



కాల్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మాట్లాడుతూ.. రైతుల కోరిక మేరకు రోజుకు 400 క్యూసెక్కుల చొప్పున చివరి తడిగా 10రోజుల పాటు 0.3 టీఎంసీ నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు, స్థానిక ఎమ్మెల్యేగా ఎన్నిసార్లు చెప్పిన వినకుండా ఈ ప్రభుత్వం నీటి అలకేషన్ లేని ప్రాంతాలకు వరదకాలువ ద్వారా 4 టీఎంసీలు క్రిందికి విడిచి అలకేషన్ ఉన్నటు వంటి లక్ష్మీ కెనాల్, చౌటపల్లి హనంత్‌రెడ్డి లిఫ్ట్, నవాబ్ లిఫ్ట్‌ల ఆయకట్టులోని రైతన్నలకు సాగునీరు ఇవ్వకుండా ఇబ్బందికి గురి చేస్తుందని విమర్శించారు. ఏది ఏమైనా లక్ష్మీ కెనాల్ ద్వారా ఆఖరి తడి కొరకు నీటి విడుదల కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఐఐటి ఒలంపియాడ్‌లో సత్తా చాటిన శాంభవి విద్యార్థులు

- ఇంటర్ స్టేట్ లెవెల్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు
- ఇస్రో శాస్త్రవేత్తలచే ప్రశంసలు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-బాల్కొండ

అభ్యసోత్సవ్ 2024 ఇంటర్ స్టేట్ అన్యువల్ అవార్డులలో శాంభవి హై స్కూల్ విద్యార్థులు స్టేట్ లెవెల్ ర్యాంకులు సాధించారని గురువారం పాఠశాల చైర్మన్ బొట్ల మధుసూదన్ రాజు, కరస్పాండెంట్ రవిన్ ప్రసాద్ తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన టెస్ట్ అభ్యసోత్సవ్ 2024 ఐఐటి ఒలంపియాడ్ ఇంటర్ స్టేట్ లెవెల్ అవార్డ్స్‌లో శాంభవి పాఠశాల 3వ తరగతి విద్యార్థిని సహస్ర శోభిత ఫస్ట్ ర్యాంక్, 9వ తరగతి విద్యార్థిని టి.మహిత ఫస్ట్ ర్యాంక్, 8వ తరగతి విద్యార్థిని డి.సాహితి థర్డ్ ర్యాంక్, 7వ తరగతి విద్యార్థిని టి.సాయి నమ్రత థర్డ్ ర్యాంక్, 6వ తరగతి విద్యార్థి జి.రుత్విక్ థర్డ్ ర్యాంక్, 4వ తరగతి విద్యార్థిని ఎస్.వైష్ణిక థర్డ్ ర్యాంక్, 3వ తరగతి విద్యార్థిని బి.తన్వి థర్డ్ ర్యాంక్ సాధించారని, ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఇస్రో శాస్త్రవేత్తల చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసలు అందుకున్నారని చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ బొట్ల మధుసూదన్ రాజు, కరస్పాండెంట్ బొట్ల రవిన్ ప్రసాద్ విద్యార్థులను అభినందించారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని ఖాజాపూర్ సమీపంలో గల వాగులో గురువారం గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. 30- 35 సంవత్సరాల వయసున్న వ్యక్తి ఖాజాపూర్ వాగులో నీటిలో తేలడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించినట్టు తెలిపారు. ఖాజాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మహేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



వాగులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండాలి

- కరెస్పాండెంట్ బోట్ల రవీన్ ప్రసాద్
- ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ-బాల్కొండ

విద్యార్థులందరూ బాగా చదువుకొని ఉన్నతమైన స్థానంలో ఉండాలని కరెస్పాండెంట్ బోట్ల రవీన్ ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శాంభవి హైస్కూల్లో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ బోట్ల రవీన్ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్య యొక్క ప్రాముఖ్యతను, ఈ సమాజంలో విద్యకున్న గౌరవం, విశిష్ట గురించి క్రమశిక్షణ గురించి వివరించారు. విద్యార్థుల్లో ఉన్న సజనాత్మక వెలికి తీయడం కోసం కషి చేస్తున్న ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను వారు అభినందించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారి విద్యార్థినీలు వేదికపై నత్యాలు ప్రదర్శించిన విధానం చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



విద్యార్థులకు ప్రవంసా పత్రాలు అందజేత

కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ బొట్ల విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ బొట్ల ఇంద్రాణి, వైస్ ప్రిన్సిపాల్ బొట్ల మంజుల, ఉపాధ్యాయ బందం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

దళితులు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపాలి

- దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షులు కిన్నెరా సిద్ధార్థ



కరపత్రాలను విడుదల చేస్తున్న తదితరులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

దళితులంతా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షులు కిన్నర సిద్ధార్థ అన్నారు. దళిత వికాస సమితి రూపొందించిన కరపత్రాన్ని నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి జగిత్యాల పట్టణంలోని వారి ఇంటి వద్ద గురువారం విడుదల చేశారు. ఈ సమావేశంలో దళిత వికాస సమితి నిజామాబాద్ పార్లమెంట్ ఇంచార్జి చిట్ల గంగాధర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఇంచార్జి దాసరి గంగాధర్, జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జి కొప్పుల సుమంత్, కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జి సంగెమ్ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

పెళ్లికి నిత్యావసర సరుకుల అందజేత



నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని 12వ వార్డు రాకాసిపేట్‌లో గల సవితబాయి అశోక్ దంపతుల కూతురి వివాహానికి పట్టణ బిజెపి కిషన్ మోర్చా అధ్యక్షులు ఏసాల సురేందర్ (సూరి) గురువారం పెళ్లికి సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యాన్ని అందజేశారు. ఈ సంధర్భంగా ఏసాల సూరికి వధువు కుటుంబ సభ్యులు, కాలనీవాసులు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని నడిపల్లి గ్రామ పంచాయతీ శివారులోని జాతీయ రహదారి 44 హైలాండ్ రోడ్డు పక్కన అనాథ శవం ఉందని డిచ్‌పల్లి ఎస్సై మహేష్, గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్‌కు వివరించగా వేంటనే నడిపల్లి మేజర్, గ్రామ పంచాయతీ గ్రేడ్‌వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావుకు సమాచారం అందజేశారు. గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్లు రాము, సంతోష్, కంప్యూటర్ ఆపరేటర్ శ్యాం సన్‌అటెండర్ బాబా, సఫాయి సిబ్బంది నర్సయ్య, రాజేష్, దుర్గవ్వతో కలిసి మతదేహం ఉన్న చోటికి చేరుకుని అనాథ శవానికి టాక్టర్ సాయంతో స్మశాన వాటికకు తీసుకువెళ్లి జెసిబితో గుంత తవ్వి ధన సంస్కారాలు జరిపినట్టు గ్రేడ్‌వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావు తెలిపారు.

టిడిపి పట్టణ అధ్యక్షుడిగా అంబిక సత్యనారాయణ

- జనరల్ సెక్రెటరీగా శంకర్ ముదిరాజ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నిజామాబాద్ అర్బన్ ఇంచార్జి వినోద్‌కుమార్ పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొని అట్టి కమిటీని పార్లమెంట్ అధ్యక్షులకు రాష్ట్ర పార్టీ కార్యాలయానికి ఆమోదం కొరకు పంపించారు. ఆ కమిటీని పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యాదగౌడ్ రాష్ట్ర పార్టీ ఆమోదం మెరకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అర్బన్ అధ్యక్షులుగా అంబిక సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కల్లెడ గంగాధర్, ఉపాధ్యక్షులుగా అర్సపల్లి అశోక్, చెరుకు గంగాధర్, నాగారం రాములు, నాగేశ్వరరావు, జనరల్ సెక్రెటరీగా శంకర్ ముదిరాజ్, జనరల్ సెక్రెటరీగా నవాతే నర్సయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా రాజ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా గంగోనే రాజేశ్వర్, జాయింట్ సెక్రెటరిలుగా రాజేశ్వర్ గుప్తా, రామకష్టారెడ్డి, వెంకటరమణ ఎన్నికయ్యారు. నూతనంగా ఏర్పడిన అర్బన్ కమిటీలో ప్రతి ఒక్కరూ ఎల్లవేళలా ప్రజల పక్షాన పోరాడుతూ, పార్టీ అభివద్ధి కోసం పనిచేయాలని పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యాదగౌడ్ అన్నారు. ఈ కమిటీతో పాటు అనుబంధ కమిటీలను ఏర్పాటు చేశారు.

ఎక్స్‌ప్లోర టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-బాల్కొండ

మండలం కేంద్రంలోని కష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థినీలు ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన" ఎక్స్ ప్లోర టాలెంట్ టెస్ట్"లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్ తెలిపారు. ఈ ప్రతిభ పోటీల్లో రిత్విక 2వ తరగతి జిల్లా స్థాయి ప్రథమ బహుమతి సాధించగా, శ్రీ లాస్య 8వ తరగతి, రక్షణ్య 9వ తరగతి ఈ విద్యార్థులు బహుమతులు సాధించినట్లు అయిన తెలిపారు. సికింద్రాబాద్ లోని " హరి హర కళాభవన్‌లో " బుధవారం విద్యార్థులకు బహుమతులు తో పాటు మెడల్స్ లను అందించారు. ఎక్స్ ప్లోర ప్రతిభ పోటీల్లో మంచి ప్రతిభ సాధించి జిల్లా స్థాయి ప్రథమ, 2వ బహుమతులు సాధించిన విద్యార్థులను గురువారం పాఠశాల డైరెక్టర్లు కోటగిరి భాను చందర్, ఆకుల లక్ష్మణ్‌లు అభినందించారు.



ఏటీఎంలో చిరిగిన నోటు



నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఏరియాలో గల హెచ్‌డిఎఫ్‌సి ఏటీఎంలో డబ్బులు డ్రా చేయగా అందులో ఒకటి చిరిగినోటు రావడంతో ఖాతాదారుడు ఖంగుతిన్నాడు. దాన్ని మళ్లీ డిపాజిట్ చేస్తే తీసుకోకపోవడంతో ఆందోళనకు గురైయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. ఓ మొబైల్ దుకాణదారుడు తనకు డబ్బులు అవసరం కావడంతో దగ్గరలో గల హెచ్‌డిఎఫ్‌సి ఏటీఎం నుంచి గురువారం ఉదయం 7 గంటల ప్రాంతంలో రూ.5వేలు డ్రా చేయగా మధ్యలో ఒక 500 నోటు చిరిగినది వచ్చింది. అదే సమయంలో మళ్లీ డిపాజిట్ చేసేందుకు ప్రయత్నించగా స్వీకరించకపోవడంతో ఆందోళనకు గురైయ్యాడు. తర్వాత బ్యాంక్‌కు వెళ్లి విషయం వివరిస్తే నోటుమార్చి ఇవ్వడంతో బాధితుడు ఖుషి అయ్యాడు.

వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు కీర్తికి పిహెచ్‌డీ



నవతెలంగాణ-సదాశివనగర్

ఉస్మానియా విశ్వవిద్యాలయం సైన్సు కళాశాల బోటని విభాగంలో ప్రొఫెసర్ ఎ.సబితా రాణి పర్యవేక్షణలో 'ఇన్విట్రో కల్చర్ అండ్ ఫైటో కెమికల్ ప్రొఫైలింగ్ ఆఫ్ ఓపర్క్యులిన టార్పెతం (ఎల్) సిల్వ మాన్‌సో అనే అంశంపై మైలారం కీర్తి తన పరిశోధన గ్రంథాన్ని సమర్పించడంతో ఓయూలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ మేరకు ఓయూ పరీక్షల విభాగం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. డా.కీర్తి ప్రస్తుతం కామారెడ్డిలో గల తెలంగాణ స్టేట్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళశాలలో బోటని లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. విజయవంతంగా పరిశోధన పూర్తి చేసుకొని పిహెచ్‌డి పట్టా సాధించినందుకు గాను ఆమెను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.రాధిక, వైస్ ప్రిన్సిపల్ వి.రేణుక, అకాడమిక్ కోఆర్డినేటర్ కే.వనజ కళాశాల అధ్యాపక బృందం అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- అదనపు కలెక్టర్ చంద్రమోహన్
- పలు చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-భిక్కనూర్/రామారెడ్డి/దోమకొండ/సదాశివనగర్

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ రైతులకు తెలిపారు. గురువారం మండలంలోని రామేశ్వర్ పల్లి, భిక్కనూర్ సింగిల్ విండో సొసైటీ కార్యాలయాల ఆవరణలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 83 ప్రభుత్వ వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి గింజ కొనుగోలు చేసేంతవరకు కొనుగోలు కేంద్రాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శివప్రసాద్, సివిల్ సప్లై డిటి కిష్టయ్య, రామేశ్వర్ పల్లి సొసైటీ సీఈఓ శంకర్, భిక్కనూర్ సొసైటీ సీఈవో నర్సింలు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రామారెడ్డి : మండలంలోని మద్దికుంట, స్కూల్ తాండ తో పాటు పలు గ్రామాల్లో గురువారం వరి కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు రైతులు వరి ధాన్యాన్ని విక్రయించి లబ్ధి పొందాలని, దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో వీడీసీ వడ్ల లక్ష్మయ్య, స్కూల్ తాండ పంచాయతీ కార్యదర్శి రాజేష్, రైతులు బండి ప్రవీణ్, రాజిరెడ్డి, నర్సారెడ్డి, గుబ్బల బాలరాజ్, గోజారి భాస్కర్ రెడ్డి, తోట కరుణాకర్, సిద్ధం శంకర్, ముదాం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్



రామారెడ్డి మండలంలో..

రైతులు కొనుగోలు కేందాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దోమకొండ : దోమకొండ మండలంలోని ముత్యం పేట్ సహకార సంఘం సొసైటీ సీఈఓ రాంచంద్రం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేందాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులు పండించిన వరి ధాన్యం ను కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని, ప్రభుత్వం వరి ధాన్యం కు మద్దతు ధర అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కృష్ణా రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సదాశివనగర్ : మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించారు. సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ సొసైటీ పరిధిలోని గ్రామాలు తిర్మన్ పల్లి, ధర్మారావు పేట్, అమర్లబండ, ముద్దోజివాడి.సదాశివనగర్ గ్రామల రైతులు కొనుగోలు కేంద్రం ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కవిత, సి.ఈ.ఓ విగ్నేష్ గౌడ్, సొసైటీ సిబ్బంది బాల్ రాజు ,మహేష్, లక్ష్మన్ రైతులు. తదితరులు పాల్గొన్నారు.

12న బసవేశ్వర విగ్రహావిష్కరణ

- మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

నవతెలంగాణ-జుక్కల్

విశ్వగురువు, వీరశైవ లింగాయత్ ఆరాధ్య దైవం మహాత్మ బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ మండలంలోని లొంగన్‌లో ఈనెల 12న చేపట్టనున్నట్టు నిర్వహకులు తెలిపారు. కాగా ఈ వేడుకకు హాజరు కావాల్సిందిగా మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండేకు గురువారం ఆహ్వాన పత్రం అందజేశారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరశైవ లింగాయత్ పెద్దలు సదుపటేల్ మాట్లాడుతూ.. మండలంలోని లొంగన్ గ్రామంలో మహత్మ బసవేశ్వర విగ్రహం నిర్మాణం అందరి సహకారంతో పూర్తి చేశామనితెలిపారు. ప్రారంబోత్సవ కార్యక్రమానికి వీరశైవ లింగాయత్, అందరు భారీగా లొంగన్ గ్రామానికి తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని పోతాయపల్లి గ్రామ సమీపంలో పెద్దమ్మ ఆలయం వద్ద గురువారం అజయ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దమ్మ విగ్ర ప్రతిష్టాపన ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ అజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బిపి షుగర్ కాళ్ల నొప్పులు కీళ్ల నొప్పులు జలుబు పరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదే విధంగా ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను భక్తులకు వివరించారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో ఆలయ కమిటీ నిర్వాహకులు డాక్టర్ అజయ్ కుమార్ వారు సిబ్బంది చాలా కప్పి ఘనంగా సన్మానించారు. ఉచిత వైద్య శిబిరానికి పెద్ద ఎత్తున తరలివచ్చి పలువైద్య చికిత్సలు చేయించుకున్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- ఎంపీవో బ్రహ్మం



పశువుల తొట్టెను పరిశీలిస్తున్న ఎంపీవో

నవతెలంగాణ-పిట్లం

వేసవిదృష్ట ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపిఓ బ్రహ్మం సూచించారు. గురువారం మండలాలలోని గౌరారం తాండ గ్రామపంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ సెక్రటరీలు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. పశువుల తొట్టెలను శుభ్రపరచి నిరంతరం నీటితో నిండుకుండలా చర్యలు చేపట్టి పశువుల దాహాన్ని తీర్చాలని ఆయన సూచించారు. పంచాయతీలలో లీకేజీలు, గుంతలో ఉన్నచో వెనువెంటనే మరమ్మతులు నిర్వహించాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలతో పాటు, అంగన్వాడీ సెంటర్‌ను తనిఖీ నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వాగ్దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

నాబార్డ్ ఆద్వర్యంలో సర్టిఫికేట్లు అందజేత

నవతెలంగాణ-జుక్కల్

నాబార్డ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వారికి గురువారం ఐకేపీ భవనంలో సర్టిఫికేట్లు అందజేసినట్టు ఐకేపీ ఎపీఎం సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపిఎం సత్యనారాయణ మాట్లాడుతు తేది 15 మార్చి 2024 లో జుక్కల్ మరియు పెద్ద గుల్లా లో రెండు బ్యాచులకు శిక్షణతరగతులు ప్రారంభించినట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘంలో ఉన్న మహిళలకు మాత్రమే మగ్గం వర్క్ 20రోజుల శిక్షణ తరగతులు నేర్పించినట్టు తెలిపారు. ఇరువై రోజుల తరువాత ఎప్రిల్ 4వతేది గురువారం సర్టిఫికేట్లు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅథితిగా నాబార్డ్ ఏజీఎం ప్రవీణ్ కూమార్, ఎస్ఐడీఎస్ గంగాధర్ రావ్, ఎన్టీపీసీ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎపిఎం సత్యనారాయణ, నాబార్డ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గోపినాథ్ రెడ్డి, సిసి లు మహేష్, తుకారాం, హన్మండ్లు, ట్రైనర్లు శ్వేత, మునీబీ, శంకర్ , సాయులు తదితరులు పాల్గొన్నారు.

నియోజక వర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడిగా బొడ్ల రాజు

నవతెలంగాణ-పిట్లం



ఎమ్మెల్యేను కలిసి బొడ్ల రాజు

కాంగ్రెస్ పార్టీ జుక్కల్ నియోజకవర్గ ప్రచార కమిటీ నూతన అధ్యక్షుడిగా బొడ్ల రాజును నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రచార కమిటీ నూతన అధ్యక్షుడు బొడ్ల రాజు మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ తనపై నమ్మకముతో అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పడం వల్ల పార్టీకి విధేయుడనై ప్రచార బాధ్యతలు నిస్వార్థంగా సేవలు అందిస్తూ స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఆదేశానుసారముగా పార్టీలో ఉంటూ ప్రతి ఒక్క కార్యకర్త , శ్రేయోభిలాషులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు. అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పినందుకు ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని ఆయన అన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు , కార్యకర్తలు , శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అబార్షన్ కిట్ల విక్రయాలు

- ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఫార్మసీలు..
- పట్టించుకోని డ్రగ్స్ కంట్రోల్ అధికారులు



నవతెలంగాణ-రామారెడ్డి

వైద్యుల సూచనలు లేకుండానే, అవగాహన లేకుండా, ఇష్టారాజ్యంగా అబార్షన్ కిట్లు విక్రయిస్తుండటంతో తీవ్రరక్తస్రావంతో మహిళలు ప్రాణాప్రాయ స్థితికి వెళ్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా పలు ఫార్మసీలు ప్రాణాలతో చెలగాటమాడు తున్నాయి. అలాంటి మెడికల్ షాపుల పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో రామారెడ్డి, రెడ్డి పేట లో పలు మెడికల్ షాపులపై డ్రగ్స్ అధికారులు దాడి చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నా వారి తీరు మారటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రెడ్డిపేట్ పరిధిలోని తండా గిరిజన మహిళ, మెడికల్ షాపులో అబార్షన్ కిట్టు కొనుగోలు చేసి వినియోగించడంతో అధిక రక్తస్రావంతో చికిత్స కోసం కామారెడ్డి ఆసుపత్రికి, అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ వెళ్లినట్లు విశ్వాసనీయ సమాచారం. అధికారులు వెంటనే స్పందించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మెడికల్ షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారి రాజిరెడ్డిని నవతెలంగాణ చరవాణిలో వివరణ కోరగా... విచారణ చేపట్టి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రతి ఒక్కరికి ఉపాధి పని కల్పించాలి

- ఎంపీడీవో శ్రీనివాస్

నవతెలంగాణ-జుక్కల్



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి హమీ పనులు కల్పించాలని ఎంపిడీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాదీ హమీ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్బంగా ఎంపిడివో, ఏపీవో తులసీరామ్, ఈసీ స్వామీ దాస్ మాట్లాడుతూ.. ముఖ్యంగా గ్రామాలలో తాగునీటి సమస్యలను గుర్తించాలని అన్నారు. డ్యామేజ్ అయిన పైప్‌లను మరమ్మత్తులు చేయించాలని, నీటి ఎద్దడి తలెత్తకుండా సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు రావద్దని తెలిపారు. ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉన్న వారికి తప్పక ఉపాదీహమీ పథకంలో కూలీ పనులను కల్పించాలని, కూలీపనులకు రాని వారికి ప్రత్యేకంగా అవగాహన కల్పించి పనులకు వచ్చే విధంగా చేయాలని సూచించారు. ఎండతీవ్రత అధికంగా ఉందని దృష్టిలో పెట్టుకొని పనులను ఉదయం ఆరు గంటలకు ప్రారంభించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 30 జీపీలకు సంభందించిన జీపీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయం వేళల్లో ఉపాధి పనులు చేపట్టాలి

పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఎండల నుండి కాపాడుకోవాడానికి వైద్యఆరోగ్య శాఖ చర్యలు చేపట్టిందని పడంపల్లి గ్రామ ఎఫ్ఏ సూర్యకాంత్, ఆశా వర్కర్ భాగ్యశ్రీ అన్నారు. గురువారం గ్రామంలోని పొలిమెరలలో కూలీ పనులు చేస్తున్న పని ప్రదేశంలో ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయికి వెళ్లి ఎండ నుండి తమకు తాము ఎలా కాపాడుకోవాలో, డీహైడ్రేషన్ కు గురైనవారికి ఎలా ప్రథమ చికిత్స చేయాలో అవగాహన కల్పించారు. అనంతరం కూలీలందరికి వైద్యఆరోగ్యశాఖ సరఫారా చేసిన ఓఆర్ఎస్ ప్యాకేట్లను పంపిణి చేసి ఎలా వాడాలో ఎఫ్ఏ, ఆశావర్కర్ కూలీలకు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఏ సూర్యకాంత్, ఆశా వర్కర్ భాగ్యశ్రీ, ఉపాదీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం దేశానికి అవసరం

- టీచర్ ప్లస్ కార్యాలయాన్ని సందర్శించిన ఎన్‌సిటిఈ సభ్యులు డాక్టర్ పారిపల్లి శంకర్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని టీచర్ ప్లస్ ఆఫ్ కార్యాలయాన్ని ఎన్‌సిటిఈ సభ్యులు, ఉస్మానియా యూనివర్సిటీ సహాయ ఆచార్యులు డాక్టర్ పారిపల్లి శంకర్ గురువారం సందర్శించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో నూతనంగా దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రకాలైన కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థుల కోసం,వివిధ రకాలైన పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్న వారికోసం డిజిటల్ తరగతుల నిర్వహణకు గాను ఈ- లెర్నింగ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిన టీచర్ ప్లస్ ఆఫ్ సీఈఓ డాక్టర్ వేదప్రకాష్ ను అభినందించారు.

ఈ సందర్భంగా ఎన్సిటిఈ సభ్యుడు, ఉస్మానియా యూనివర్సిటీ సహాయ ఆచార్యులు డాక్టర్ పారిపల్లి శంకర్ మాట్లాడుతూ దేశంలో కరోనా తర్వాత ఆన్‌లైన్ తరగతుల ప్రాముఖ్యత ఎంతగానో పెరిగిందని కేంద్ర ప్రభుత్వం ఎన్నో రకాలైన డిప్లమా కోర్సులను అందజేస్తున్నట్టు తెలిపారు. దేశంలో విద్యారంగంలో సాంకేతిక మరింతగా పెరగవలసిన అవసరం ఉందన్నారు. మాసివ్ ఆన్లైన్ ప్లాట్ పామ్ ద్వారా లక్షలాదిమంది విద్యార్థులు ఎన్నో రకాలైన కోర్సులను అభ్యసిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పారిపల్లి శంకర్‌ను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో బివిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు,టీచర్ ప్లస్ అధ్యాపక బృందం కళ్యాణ్ చరణ్,రంగ కిషన్,డాక్టర్ పుట్ల అనిల్, వీరాచారీ, హనీఫ్ పాషా, నాగేందర్ గౌడ్, వికాస్, శైలజ లు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ పారిపల్లి శంకర్‌కు సన్మానం

నేడు కాంగ్రెస్ కార్యకర్తలతో మీటింగ్

నవతెలంగాణ-లింగంపేట్

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమావేశంలో మండలంలోని లింగంపల్లి గ్రామ సమీపంలో గల అమృత కన్వెన్షన్‌లో శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారాగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ శెట్కర్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మధన్‌మోహన్ రావు నియోజకవర్గం స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ఈ సమావేశాన్ని నిర్వహించనున్నామని, కావున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుస్వామి జాతర ఉత్సవాలు

మొదటి రోజు ఎడ్లబండ్ల ప్రదర్శన

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఐయ్యపల్లి అటవీ ప్రాంతంలో గల ప్రభుస్వామి ఉత్సవాలు సోమవారం నుంచి మూడు రోజులపాటు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగానే సోమవారం ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించనున్నట్టు తెలిపారు. మంగళవారం రథోత్సవం, బుధవారం ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో వేరువేరు ఘటనలో ఇద్దరు ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన రామారెడ్డి, ఇస్సన్న పల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. రామారెడ్డి గ్రామానికి చెందిన బిడ్ల లక్ష్మీ (35) మంగళవారం ఇంటి ప్రక్కన గల బిట్ల అనసూయ తో డ్రైనేజ్ పై గల రాళ్ల విషయంలో గొడవపడి తిట్టుకోవడంతో, బిట్ల లక్ష్మి మనస్థాపం చెంది, వ్యవసాయం గడ్డి నివారణ క్రిమిసంహారకమందు సేవించింది. అపస్మారక స్థితిలో ఉండగా, భర్త రాజు గమనించి ప్రథమ చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డిపేట్, అక్కడినుండి మరింత మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెంది. భర్త రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

ఇస్సన్నపల్లికి చెందిన దొంతుల నరేష్ (53) అప్పు చేసి ముగ్గురు కూతుర్ల వివాహం చేశారు. అనంతరం అనారోగ్యానికి గురికావడంతో ఇంటి వద్దనే ఉంటున్నారు. చేసిన అప్పు తీర్చే మార్గం లేక మదనపడుతూ తీవ్ర మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ విజయ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనుమానస్పద స్థితిలో ఒకరి మృతి

నవతెలంగాణ-దోమకొండ



మృతిచెదిన మోహన్‌రెడ్డి

అనుమానస్పద స్థితిలో రోడ్డు ప్రమాదం లో ఒకరు మృతి చెందిన ఘటన దోమకొండ మండలంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం బీబీపేట మండలం లోని ఇస్సానగర్ గ్రామానికి చెందిన అంతం మోహన్ రెడ్డి (50) కొన్ని రోజుల క్రితం ద్విచక్ర వాహనం స్కూటీ కొనుగోలు చేశాడు. వాహనం రిజిస్ట్రేషన్ కోసం కామారెడ్డి జిల్లా కేంద్రనికి వెళ్లి గ్రామనికి తిరుగు ప్రయాణం లో మార్గం మధ్యలో దోమకొండ మండలం లోని అంచనూరు గ్రామ శివారులో ని రోడ్డు ప్రక్కన ఉన్న వ్యవసాయం భూమి వద్ద రక్త గాయలతో మృతి చెంది ఉన్నాడు. మృతుని ఏదో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందా లేక ఎవరైనా దాడి చేశారో అనుమానం ఉందని అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడని భార్య అంతం ఇందిరా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. మృతినికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు.

ఏర్గట్ల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్ చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రయాణికులకు, బాటసారులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించామని అన్నారు. ఇందులో భాగంగా రెవిన్యూ జూనియర్ అసిస్టెంట్ వెంకటేష్, కారోబార్ సాయన్న, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్న్ షిప్



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గిరిరాజ్ కళాశాలలోని వాణిజ్య శాస్త్ర విభాగం, హైదరాబాద్‌లోని ఇన్స్టిట్యూట్ అఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజ్-(ఐపీఈ)తో హైదరాబాద్‌లో అవగాహన ఒప్పందం చేసుకున్నామని జీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామ్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులకు పరిశోధనకు సంబంధించి, సిలబస్‌లో మార్పులు చేర్పులు, ఇంటర్న్షిప్‌కు అవకాశం ఉంటుందని వివరించారు. కళాశాల ప్రతినిధులుగా డాక్టర్ రామ్‌మోహన్‌రెడ్డి, వాణిజ్య శాస్త్ర విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.లింగన్న ఈ ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. ఐపీఈ ప్రతినిధులు డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస మూర్తి, ప్రొఫెసర్ వై.రామకృష్ణ ఇతర సభ్యులు పాల్గొన్నారు

పలు వివాహ వేడుకల్లో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి


వివాహంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని రూప్లానాయక్ తండాలో, డిచ్‌పల్లి మండలంలోని సాంపల్లి గ్రామంలో గురువారం పలు వివాహ వేడుకల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, మండలాధ్యక్షులు మోత్కురి నవీన్‌గౌడ్, అమృతపూర్ గంగాధర్, డిసిసిబి డైరెక్టర్ కోరట్‌పల్లి అనంద్, బ్లాక్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు సంతోష్‌రెడ్డి, బోర్వెల్స్ రాజేందర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు శ్యాం సన్, దర్మగౌడ్, మోతిలాల్, కిసాన్‌ఖేత్ మండలాధ్యక్షులు గంగాధర్, సొసైటీ డైరెక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ సామల రాజేష్, బైరయ్య, బద్దంరెడ్డి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

వీరన్నగుట్ట బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిచిన్న ఎంపీడీవో శంకర్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట బస్టాండ్‌లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో శంకర్, ఎంపీఓ గౌస్ ఉద్దీన్ ప్రారంభించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ప్రధాన రోడ్డులో ఉన్నటువంటి గ్రామాలలో రద్దీ గల ప్రాంతాలను గుర్తించి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో, గ్రామ కార్యదర్శి రాజు గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కారోబార్ బాబా, ఆరోగ్య కార్యకర్త విజయ, అంగన్వాడి కార్యకర్తలు విజయలక్ష్మి, శాంత, ఆశాలు కవిత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

స్కావెంజర్ కుటుంబానికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కావెంజర్‌గా సేవలందించి, ఫిబ్రవరి 8వ తేదీన ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడి మరణించిన చేపూర్ నారాయణ కుటుంబానికి ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి 16 వేల రూపాయలను అతని భార్య ఆశమ్మకు అందజేయడంతో పాఠశాలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి మాట్లాడుతూ.. పాఠశాలకు నారాయణ ఎంతో సేవ చేశారని, అతని మరణం ఆయన కుటుంబానికి, పాఠశాలకు తీరని లోటని అన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభించిన్న వ్యవసాయాధికారి రాజ్‌కుమార్

నవతెలంగాణ-ముప్కాల్

రెంజర్ల ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉదయం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. రెంజర్ల సొసైటీ ద్వారా క్లస్టర్ రైతులకు అందుబాటులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 'ఏ' గ్రేడ్ ధర రూ.2,203 రూపాయలు, 'బీ' గ్రేడ్ ధర రూ.2,183 రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముప్కాల్ మండల వ్యవసాయాధికారి ఏ.రాజ్‌కుమార్, సొసైటీ సెక్రటరీ కె.గంగాధర్, సొసైటీ సిబ్బంది సాగర్, ప్రవీణ్ కుమార్, వినయ్ కుమార్, భూమేశ్వర్, శివ కిరణ్ తదితరులు పాల్గొన్నారు

కలవరం రేపిన ఉద్యోగి బదిలీ

- ఓ పార్టీ ప్రచారంలో పాల్గొన్నట్టు ఫిర్యాదులు రావడంతో నిర్మల్‌కు బదిలీ
- ప్రచారంలో పాల్గొనేవాళ్లు తస్మాస్ జాగ్రత్త

నవతెలంగాణ-ఆర్మూర్

మాజీ మంత్రి, ప్రస్తుత బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి స్వస్థలం వేల్పూర్ విద్యుత్ శాఖ ఏఈ యశ్వంతరావు బదిలీ ఉమ్మడి జిల్లాలోని కలవరం రేపింది. సోషల్ మీడియాలో ఒక పార్టీకి ప్రచారం చేస్తున్నారన్న ఫిర్యాదుపై ఆయనను నిర్మల్ జిల్లాకు బదిలీ చేయడం చర్చనీయాంశం అయ్యింది. అయితే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులే ఓ పార్టీకి వత్తాసు పలుకుతూ మెసేజ్ చేయడంతో, ఆ మెసేజ్‌ను ఏఈ ఫార్వర్డ్ చేసినట్టు విద్యుత్ అధికారులు గురువారం తెలిపారు.

ప్రచారంలో పాల్గొన్నా..
రాజకీయాల్లో తలదూర్చినా..

పార్లమెంట్ ఎన్నికల సందడి ప్రస్తుతం ఎక్కడ చూసినా కనిపిస్తుంది. రాజకీయాలంటే అందరికీ ఆసక్తి ఉంటుంది. ఉద్యోగ, ఉపాధ్యాయులు సైతం రాజకీయాలంటే ఇష్టపడేవారు ఉంటారు. కాగా ఎన్నికల కమిషన్ నిబంధనలను కఠినతరం చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు రాజకీయాల్లో తల దూర్చొద్దు. పార్టీలు నిర్వహించే ఎన్నికల ప్రచారాల్లో ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా గానీ పాల్గొనవద్దు. ఇది నిబంధన అయితే కొంతమంది ఇదేమీ పట్టనట్టు ప్రచారాలలో పాల్గొంటున్నట్లు సోషల్ మీడియాలో దర్శనమిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికలలో ఇతర జిల్లాలలో పాల్గొన్న ఒక ఉపాధ్యాయుడు సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పార్టీ ప్రచారాలలో పాల్గొంటున్నారో లేదోనని నిఘావర్గాలు, ఎన్నికల కమిషన్ కూడా ఆరా తీస్తున్నాయి. సాధారణంగా వేసవి సెలవులు, విద్య సంవత్సరం ప్రారంభం సమయంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు ఇతర నాయకులు తమ సంఘాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం గతంలో నిర్వహించారు. కొన్ని ప్రభుత్వ, అనుకూల సంఘాలు గుట్టుగా తమ వారి కోసం ప్రచారాలు నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

ప్రత్యేక నిఘా..

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా సరే సంఘాల పేరుతో రాజకీయ నాయకుల ప్రచారాలు కొనసాగిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. ఉమ్మడి జిల్లాల్లో గతంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగ ఉపాధ్యాయులు చాలామంది ఉన్నారు. ఎన్నికల ప్రచారాలలో పాల్గొంటే మాత్రం ఇక ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రైతులు పండించిన ధాన్యాన్ని ప్రయివేటు దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్‌డీసీసీబీ) చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తే గతంలో డబ్బులు ఎగ్గొట్టిన ఘటనలు చోటుచేసుకున్నాయని, అందుకు కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధరతోపాటు గ్యారెంటీ ఉంటుందని తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఎన్‌డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 856 కొనుగోలు కేంద్రాలను అన్ని సౌకర్యాలతో అధికార యంత్రాంగం ఏర్పాటుచేసిందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా ఏప్రిల్ 1న అన్నిచోట్ల అధికారులే కేంద్రాలను ప్రారంభించారని అన్నారు. సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుందని, లక్ష్యం మేరకు సేకరణకు సర్వం సిద్ధం చేశారన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని, కడ్తా పేరుతో తరుగు తీసినట్లు తమ దృష్టికి వస్తే అలాంటి రైస్‌మిల్లులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం ఏ గ్రేడ్ రకానికి రూ.2203, సాధారణ రకానికి రూ.2180లకు కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వ కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే డీసీఓ, డీఎస్ఓ, తమ దృష్టికి తిసుకురావాలని రైతులకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎన్‌డీసీసీబీ డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, గోర్కంటి లింగం పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లను విడుదల చేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు ఎం నరేందర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కేంద్రంలోని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్ పెండింగ్లో ఉన్న స్కాలర్‌షిప్, రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఆర్డీవో ఏవోకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా అధ్యక్షులు అనిల్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన నుంచి ఇప్పటివరకు కూడా సరైన విధంగా పేద మధ్యతరగతి విద్యార్థులకు స్కాలర్షిప్ రియింబర్స్‌మెంట్ రాక విద్యార్థులకు అనేక అవస్థలకు గురవుతున్నారని, పేద మధ్యతరగతి విద్యార్థులకు చదువుకునేందుకు భారంగా అవుతుందని, ఆ కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని అన్నారు. గత ప్రభుత్వం ఉన్న సమయంలో ఎన్నో అనేక ఉద్యమాలు పిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించామని, విద్యార్థులను వారి భవిష్యత్తును పణంగా పెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పారని, అదే తోవలో నడుస్తున్న కొత్త సీఎం రేవంత్ రెడ్డి సైతం వైఖరిని మార్చుకోవాలని ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలకు పాల్పడితే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఉద్యమాల నిర్వహిస్తుందని అన్నారు. పెండింగ్లో ఉన్న స్కాలర్‌షిప్‌లను, రియింబర్స్‌మెంట్ ఫెల్లోషిప్‌లను విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో అధిక నిధులు విద్యారంగానికి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో మీకు సైతం కేసీఆర్‌కు పట్టిన గతే పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి నిఖిల్, నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేత

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభించిన్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట మండలానికి వచ్చే బాధితుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు రెంజల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌రావు పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు గ్రామంలో ప్రధాన కూడలీలను గుర్తించి చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో శంకర్, ఎంపీఓ గౌస్ ఉద్దీన్ సమక్షంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ గిరి, రాణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- వరిని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలి


కొనుగొలు కేంద్రం ప్రారంభిచిన్న ఎమ్మార్వో

నవతెలంగాణ-ఏర్గట్ల

రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి తాము పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని ఎమ్మార్వో మహమ్మద్ యూసుఫ్ అన్నారు. ఏర్గట్ల పీఏసీఎస్ పరిధిలోని గ్రామాలైన ఏర్గట్ల, బట్టాపూర్ వరి కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. అనంతరం సంఘం కార్యదర్శి జక్కని శ్రీనివాస్ మాట్లాడుతూ.. వరి ధాన్యం తేమశాతం 17 శాతానికి మించకుండా, ప్రభుత్వ నిబంధనలకు లోబడి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. "ఏ"గ్రేడ్ రకానికి 2203, "బి" గ్రేడ్ రకానికి 2183 రూపాయలు ఉందని తెలిపారు. రైతులు తమ వెంట పట్టాపాస్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మోర్తాడ్ క్లస్టర్ ఆఫీసర్ మేరపాక శ్రీనివాస్, ఏఓ అబ్దుల్ మాలిక్, ఏఈఓ స్నేహ, మానిటరింగ్ ఆఫీసర్ నర్సింగ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

టూటా అధ్యక్షులుగా డాక్టర్ ఏ.పున్నయ్య ఎన్నిక


అధ్యక్షులుగా ఎన్నికైన ఏ. పున్నయ్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షులుగా డాక్టర్ ఏ.పున్నయ్య గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎం.సత్యనారాయణరెడ్డి, డాక్టర్ రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్.మోహన్ బాబు, సహాయ కార్యదర్శులుగా డాక్టర్ బాలకిషన్, డాక్టర్ నీలిమ, కోశాధికారిగా డాక్టర్ నాగరాజు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు వివేక్, అశోక్ వర్ధన్‌రెడ్డి, ఎన్నికల పరిశీలకులు డాక్టర్ కిరణ్మయి ప్రకటించారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి అభినందిస్తూ యూనివర్సిటీ అభివృద్ధిలో శక్తివంచన లేకుండా సహాయ, సహకారాలు అందించి ముందుకు వెళ్లాలని సూచించారు. పలువురు నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

కన్నుల పండువగా శ్రీ సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్టాపన


విగ్రహప్రతిష్టాపనలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-మాక్లూర్

మాక్లూర్ మండల కేంద్రంలో నిర్మించిన ఆలయంలో రామాలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ హాజరయ్యారు. మాజీ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల తండ్రి కృష్ణమూర్తి ఆశయం మేరకు రామాలయం గుడి, ప్రభుత్వ పాఠశాల నిర్మాణాన్ని చేపట్టారు. గ్రామస్తుల సహకారంతో, గ్రామపెద్దల సహకారంతో రామాలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని హంపీ పీఠాధిపతి శ్రీ సీతా రామాంజనేయ స్వామి నేతృత్వంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం మూడు రోజులపాటు కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ.. మా తండ్రి కృష్ణమూర్తి కోరిక మేరకు గ్రామంలో పాఠశాల, వెంకటేశ్వర స్వామి దేవాలయం, రామాలయ దేవాలయాన్ని నిర్మించినట్టు తెలిపారు. మా సోదరుడు మహేష్ బిగాల, గ్రామపెద్దలు, దాతలు ముందుకు రావడం వల్ల ఆలయం పూర్తి చేసుకున్నామని వివరించారు. ఈ ఆలయానికి వ్యక్తిగతంగా రూ.40 నుంచి 45లక్షల వరకు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

'వడదెబ్బ జాగ్రత్తల' పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరించ్ని ఎంపీడీవో శంకర్

నవతెలంగాణ-రెంజల్

వేసవిలో ఎండలు మండిపోతుండడంతో ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించే పోస్టర్లను మండలంలోని వీరన్నగుట్ట సబ్ సెంటర్ ఎదుట ఎంపీడీవో శంకర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు మండిపోతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖానికి మాస్కులు ధరించాలని, ఎండలో వచ్చిన వెంటనే నీటిని తాగకుండా కొంత సమయం తీసుకోవాలన్నారు. సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రజలకు అందించాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్/ఏర్గట్ల


నాగిరెడ్డిపేట్‌లో ఇఫ్తార్ విందులో ముస్లింలు

నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో గల మసీదులో గురువారం సాయంత్రం ముస్లిం సోదరులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లిం సోదరులతో ఉపవాస దీక్షను విరమింప చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస దీక్షలో పాల్గొని ఉపవాస దీక్షను విరమింప చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట శ్రీనివాస్ రెడ్డి, బోయిన విట్టల్, డివిటి కిష్టయ్య, వాసు రెడ్డి, గోపాల్ ,సుధాకర్, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల : మండలకేంద్రంలోని మజీద్‌లో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేండ్ల రమేష్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు.దీనికి ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు,తెలంగాణ రాష్ట్ర యూనియన్ కో ఆపరేటివ్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి హాజరైనారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మత సామరస్యాన్ని చాటేందుకే ఇఫ్తార్ విందు అని,అన్ని మతాల ప్రజలు అన్నదమ్ముల వలె కలిసి మెలిసి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రొక్కెడ సంజీవ్, ఆడేం గంగాప్రసాద్, మునిరోద్దీన్, బాల్కొండ నియోజకవర్గ అన్ని మండలాల మండలాధ్యక్షులు పాల్గొన్నారు.

దండిగుట్ట, వీరన్నగులో రికార్డుల పరిశీలన


రికార్డులును పరిశీలిస్తున్న ఎంపీడీవో శంకర్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట, దండిగుట్ట గ్రామ పంచాయతీలను ఎంపీడీవో శంకర్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిని సాధించాలని, గ్రామ కార్యదర్శులు రాజు, గౌతమికి సూచించారు. గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులను కల్పిస్తూ, నర్సరీల సంరక్షణ బాధ్యతలను చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీఓ గౌస్ ఉద్దీన్, కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.